ప్రజాస్వామ్యం ఖూనీ

ఎన్నికల వ్యవస్థ అపహాస్యం

చండీగఢ్ మేయర్ ఎన్నికల తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

ప్రిసైడింగ్ అధికారి చర్యలను తీవ్రంగా తప్పుబట్టిన సీజేఐ ధర్మాసనం

బ్యాలెట్ పేపర్లను ట్యాంపరింగ్ చేసినట్టు స్పష్టమవుతున్నదని వ్యాఖ్య

19న హాజరై వివరణ ఇవ్వాలని ప్రిసైడింగ్ అధికారికి ఆదేశాలు



చండీగఢ్ మేయర్ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి అనిల్ మాసిహ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఇటీవల హైడ్రామా నడుమ జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికల తీరుపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ సమయంలో ప్రిసైడింగ్ అధికారి వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ప్రిసైడింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలపై ఏదో రాసి వాటిని పాడు చేసినట్టు ఎన్నికల ప్రక్రియ వీడియోను చూస్తే స్పష్టమవుతున్నని పేర్కొన్నది. ఎన్నికల వ్యవస్థను అపహాస్యం చేశారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ప్రజాస్వామ్యం హత్యకు గురికావడాన్ని తాము ఎంతమాత్రం అనుమంతించబోమని స్పష్టం చేసింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల తీరును సవాల్ చేస్తూ ఆప్ కౌన్సిలర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో ధర్మాసనం విచారణ జరిపింది. ఎన్నికల సందర్భంగా తీసిన వీడియోను ఈ సందర్భంగా కోర్టు పరిశీలించింది. తదుపరి విచారణ జరిగే ఈ నెల 19న ప్రిసైడింగ్ అధికారి కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. చండీగఢ్ మున్సిపల్ అధికారులకు నోటీసులు జారీచేసింది.

కెమెరా వైపే ఎందుకు చూస్తున్నారు?

చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని సీజేఐ చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆయన (ప్రిసైడింగ్ అధికారి) అధికారా? నేరస్తుడా? మిస్టర్ సొలిసిటర్ జనరల్.. చూడండి, ఆయన ఎందుకు కెమెరా వైపు చూస్తున్నారు? ఇది ప్రజాస్వామ్య ఖూనీనే. రిటర్నింగ్ అధికారి ఇలాగేనా వ్యవహరించేది? సుప్రీంకోర్టు చూస్తున్నదని ఆయనకి చెప్పిండి. ఆయన తీరుపై న్యాయ విచారణ జరిపించాలి' అని జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎన్నికల ప్రక్రియ వీడియోను చూసిన తర్వాత వ్యాఖ్యానించారు. మేయర్ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, వీడియో రికార్డింగులను భద్రపరచాలని పంజాబ్-హర్యానా హైకోర్టు రిజిస్ట్రార్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరుగలేదని భావిస్తే మళ్లీ ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు ఇస్తామని స్పష్టం చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ నెల 7న జరుగాల్సిన చండీగఢ్ కార్పొరేషన్ సమావేశాన్ని వాయిదా వేయాలని ఆదేశించింది. పంజాబ్-హర్యానా హైకోర్టు ఈ పిటిషన్ విషయంలో సరిగ్గా స్పందించలేదని, కేసు వాస్తవాలను పరిగణనలోకి తీసుకోలేదని సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది.

కోర్టు వ్యాఖ్యలు.. బీజేపీకి చెంపపెట్టు

కాగా, చండీగఢ్ మేయర్ ఎన్నికల తీరుపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు బీజేపీకి చెంపపెట్టులాంటివని ఆప్, కాంగ్రెస్ పేర్కొన్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ఆ పార్టీకి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ అన్నారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను స్వాగతించిన ఆప్ ఎంపీ సందీప్ పాఠక్.. ఇది న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే
కోటి జరిమానా

- గరిష్ఠంగా పదేండ్లు జైలుశిక్ష
- అక్రమార్కులకు సహకరించిన అధికారులపైనా చర్యలు
- లోక్‌సభలో కేంద్రం బిల్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారి ఆటకట్టించటానికి కేంద్ర ప్రభుత్వం కఠిన నిబంధనలు తీసుకురానున్నది. అందులో భాగంగా సోమవారం లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టింది. దీని కింద నేరం నిరూపితమైతే గరిష్ఠంగా పదేండ్లు జైలు, కోటి రూపాయల వరకు జరిమానా విధించనున్నారు. పరీక్షల్లో అవకతవకలకు పాల్పడే ముఠానలే గాక వారికి సహకరించిన ప్రభుత్వ అధికారులు కూడా శిక్షార్హులే. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కీలకమైన పోటీ పరీక్షల్లో అవకతవకలు జరగటం, పరీక్షలు వాయిదా పడటం, సిన్సియర్‌గా చదివి పరీక్షలకు హాజరైన విద్యార్థులు నష్టపోవటం సర్వసాధారణమైంది. ఇప్పటికే ఎన్నో ఫిర్యాదులు అందుతున్నా.. ఇప్పటి వరకు పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడిన దాఖలాలు చాలా స్వల్పం. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలని నిర్ణయించింది. ఇందుకోసమే పబ్లిక్ ఎగ్జామినేషన్స్ బిల్లును లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్ ఎగ్జామ్స్‌ను మరింత సురక్షితంగా నిర్వహించేందుకు కేంద్రానికి సిఫారసులు అందాయి. వాటిని పరిశీలించిన కేంద్రం ఉన్నత స్థాయి జాతీయ సాంకేతిక కమిటీని ఈ బిల్లులో ప్రతిపాదించింది. పబ్లిక్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను తీసుకొచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. సిన్సియర్‌గా చదువుకుని పరీక్షలకు హాజరయ్యే యువ అభ్యర్థులకు భరోసా ఇవ్వటమే ఈ బిల్లు ఉద్దేశమని, అంతేకానీ విద్యార్థులు లక్ష్యంగా చేసుకుని రూపొందించిన బిల్లు కాదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ బిల్లు గురించి మొదటిసారి జనవరి 31న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రస్తావించారు. ఎగ్జామ్స్‌లో జరిగే అక్రమాల వల్ల యువత పడే ఆందోళన ప్రభుత్వం గుర్తించిందని, ఈ సమస్యపై కఠినంగా వ్యవహరించేందుకు సరికొత్త చట్టాన్ని రూపొందించాలని నిర్ణయించిందని ముర్ము వెల్లడించారు.

మూసివేత అంచున కాంగ్రెస్ 'దుకాణం'

- హస్తం పార్టీతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం
- వచ్చే ఎన్నికల్లో ఎన్డీయేకు 400 సీట్లు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలోనే ఉంటుందని, ఆ పార్టీ 'దుకాణం' మూసివేత అంచున ఉన్నదని ప్రధాని మోదీ అన్నారు. ఒకే ప్రోడక్ట్‌ను పదేపదే లాంచ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మోదీ సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్.. అదేవిధంగా కొన్ని దశాబ్దాల పాటు ప్రతిపక్షంలో ఉండాలని ఆ పార్టీ నిర్ణయించుకొన్నదని ఎద్దేవా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 370 సీట్లతో కలిపి ఎన్డీయే కూటమి మొత్తంగా 400కుపైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తన మూడో టర్మ్‌లో భారత్‌కు రానున్న వేయ్యేండ్ల పాటు బలమైన పునాది వేస్తామని పేర్కొన్నారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని, ఇది తన గ్యారెంటీ అని చెప్పారు. మోదీ తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిరా గాంధీలు భారతీయుల శక్తి సామర్థ్యాలను విశ్వసించలేదని, విదేశీయులతో పోలుస్తూ భారతీయులు నెమ్మదస్తులు, సోమరిపోతులు అని గతంలో ఎర్రకోట సాక్షిగా వ్యాఖ్యానించారని అన్నారు. కాంగ్రెస్‌తో ప్రజాస్వామ్యానికి ప్రమాదమని. ప్రతిపక్ష పాత్ర పోషించడంలో ఆ పార్టీ విఫలమైందని అన్నారు. దేశం సాధించిన విజయాలను కాంగ్రెస్ విస్మరిస్తున్నదని విమర్శించారు. నాయకుల కుటుంబసభ్యులు సొంత బలం, ప్రజల మద్దతుతో రాజకీయాల్లోని రావచ్చునని, అయితే ఒక కటుంబం పార్టీని నడుపుతూ, తమ సొంత వాళ్లను ప్రమోట్ చేయడమే వారసత్వ రాజకీయం అవుతుందని మోదీ అభిప్రాయపడ్డారు.

అన్ని సెల్లార్లలోనూ సర్వే చేపట్టాలి

జ్ఞానవాపిపై కోర్టులో పిటిషన్

వారణాసి, ఫిబ్రవరి 5: వారణాసిలోని జ్ఞానవాపి మసీదు ఆవరణలో మిగతా సెల్లార్లన్నింటిలోనూ పురావస్తు శాఖ సర్వే (ఏఎస్ఐ) చేపట్టాలని కోరుతూ విశ్వ వేదిక్ సనాతన్ సంఘ్ సభ్యురాలు ఇక్కడి ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. మసీదు ఆవరణకు సంబంధించి మతపరమైన స్వభావం నిర్ధారించటంలో సెల్లార్లలో సర్వే చేయటం కీలకమవుతుందని రాఖీసింగ్ అనే మహిళ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై వారణాసి జిల్లా కోర్టు మంగళవారం విచారణ చేపట్టనున్నది. ఔరంగజేబ్ కాలంలో ఇక్కడి దేవాలయాన్ని కూలగొట్టి మసీదు కట్టారని కొంతమంది హిందువులు కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జరిగిన ఏఎస్ఐ సర్వే అనంతరం కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. దాంతో గత వారం నుంచి మసీదు ఆగ్నేయభాగంలోని సెల్లార్‌లో హిందువులు పూజలు నిర్వహిస్తున్నారు. మసీదు ఆవరణలో మూసేసిన సెల్లార్లన్నింటిలోనూ ఏఎస్ఐ సర్వే చేపట్టాలని, అప్పుడే మసీదుకు సంబంధించి అసలు నిజాలు బయటకు వస్తాయని తాజాగా కోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. ఇటుకలు, రాళ్లతో మూసేసిన మసీదు బేస్‌మెంట్ మ్యాప్‌ను పిటిషన్‌తోపాటు కోర్టుకు రాఖీసింగ్ తరపు న్యాయవాది సమర్పించారు.

'జిగర్తాండ' పరీక్ష సూపర్ సక్సెస్

- ఐఐటీ కాన్పూర్‌లో దేశంలోనే తొలి హైపర్‌వెలాసిటీ సదుపాయం
- 3 ఏండ్లలో దేశీయంగా అభివృద్ధి
- విమానం వేగం సెకనుకు 3-10 కి.మీ. అందుకునే సామర్థ్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: భారత గగనతల పరిశోధన, రక్షణ సామర్థ్యాల పెంపులో కీలక ముందడుగు పడింది. ఐఐటీ, కాన్పూర్ దేశంలోనే మొట్టమొదటి హైపర్ వెలాసిటీ ఎక్స్‌పాన్షన్ టన్నెల్ టెస్ట్ ఫెసిలిటీని నిర్మించి విజయవంతంగా పరీక్షించింది. ఈ పరీక్ష విజయంతో అధునాతన హైపర్‌సానిక్ టెస్టింగ్ సామర్థ్యం కలిగిన దేశాల సరసన భారత్ నిలిచింది. ఎస్2 అని పిలిచే ఈ సదుపాయానికి జిగర్తాండ అనే మారుపేరు కూడా ఉన్నది. ఇది 3 నుంచి 10 కిలోమీటర్ల మధ్య విమాన వేగాన్ని ఉత్పత్తి చేయగలదు. వాహనాలు, గ్రహశకలాల ప్రవేశాన్ని, స్క్రామ్‌జెట్ విమానాలు, బాలిస్టిక్ క్షిపణుల వాతావరణ ప్రవేశ సమయంలో ఉత్పన్నమయ్యే హైపర్‌సానిక్ పరిస్థితులను ఇది కల్పిస్తుంది. గగన్‌యాన్, ఆర్ఎల్‌వీ, హైపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణులతోసహా ఇస్రో, డీఆర్‌డీవోలో కొనసాగుతున్న ఎన్నో మిషన్లకు ఇది ఎంతో ఉపయోగపడనున్నది. ఈ సౌకర్యం ఐఐటీ కాన్పూర్‌లోని ఏరో డైనమిక్స్ ల్యాబ్‌లో ఉన్నది.

సారీ.. నోరు జారా!

సీఏఏ అమలుపై కేంద్రమంత్రి శాంతనూ ఠాకూర్ యూటర్న్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: దేశంలో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుపై కేంద్రమంత్రి, బీజేపీ ఎంపీ శాంతనూ ఠాకూర్ యూటర్న్ తీసుకొన్నారు. 'ఏడు రోజుల్లో దేశవ్యాప్తంగా సీఏఏ అమలవుతుంది. ఇది నా గ్యారెంటీ' అంటూ గత వారం చేసిన వ్యాఖ్యలను ఆయన ఉపసంహరించుకొన్నారు. తాను నోరు జారానని తాజాగా చెప్పుకొచ్చారు. సీఏఏ చట్టం నిబంధనల రూపకల్పన ప్రక్రియ వారంలో పూర్తవుతుందని, త్వరలో చట్టం అమలు కానున్నదని చెప్పడం తన ఉద్దేశమని పేర్కొన్నారు. గత నెల 28న పశ్చిమబెంగాల్‌లో కుల్పిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. వారం రోజుల్లో రాష్ట్రం తోపాటు దేశవ్యాప్తంగా సీఏఏ అమలవుతుందని ప్రకటించారు. అయితే ఆయన వ్యాఖ్యలపై బీజేపీ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

రాజ్యసభ ఎంపీగా ప్రమాణానికి ఆప్ నేతకు అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ: జైలులో ఉన్న ఆప్ నేత సంజయ్‌సింగ్‌కు రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయటానికి అనుమతి దొరకలేదు. సోమవారం ఆయన ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా.. అందుకు రాజ్యసభ వైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ నిరాకరించారు. సంజయ్‌సింగ్‌పై ప్రివిలేజ్ కమిటీ విచారణ జరుపుతున్న సంగతిని ధన్‌ఖర్ గుర్తు చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టయినా సంజయ్ సింగ్ ను ఆప్ మరోసారి రాజ్యసభ ఎంపీగా నామినేట్ చేసింది. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉందని, పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు వారం పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. కానీ ప్రమాణ స్వీకారానికి మాత్రమే అనుమతి లభించింది. కాగా..కోర్టు అనుమతితో ప్రమాణ స్వీకారం కోసం పార్లమెంట్‌కు రాగా అక్కడ ఆయనకు చేదు అనుభవం ఎదురైంది.

నేటి నుంచి మార్కెట్లోకి 'భారత్ రైస్'

న్యూఢిల్లీ: బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు 'భారత్ రైస్' పథకాన్ని మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు కేంద్ర ఆహార శాఖ సోమవారం ప్రకటించింది. కేంద్ర ఆహార మంత్రి పీయూష్ గోయల్ న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నేడు పథకాన్ని ప్రారంభిస్తారని సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం, సబ్సిడీ రేటు బియ్యాన్ని 'భారత్' బ్రాండ్ పేరుతో కేంద్రం అమ్మకాలు చేపట్టింది. కిలో భారత్ బ్రాండ్ రైస్‌ను రూ.29కే అందుబాటులోకి తెస్తున్నట్టు కేంద్రం పేర్కొన్నది. 5 కిలోలు, 10 కిలోల బ్యాగుల్లో మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్టు తెలిపింది. భారత్ ఆటా , భారత్ దాల్‌ను విక్రయిస్తున్న ఏజెన్సీలతో పాటు ఈ-కామర్స్ వెబ్‌సైట్లలోనూ బియ్యం అమ్మకాలుంటాయని తెలిపింది.

ఎన్నికల ప్రచారంలో పిల్లలు వద్దు: ఈసీ

న్యూఢిల్లీ: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. పోస్టర్లు, పాంప్లెట్ల పంపకం, నినాదాలు చేయడం సహా ఏ రూపంలోనూ ఎన్నికల ప్రచారంలో పిల్లలను వినియోగించవద్దని రాజకీయ పార్టీలు, నాయకులను కోరింది. బాల కార్మిక చట్టాలను కచ్చితంగా పాటించాలని, ఈ విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నట్టు తెలిపింది. ఎన్నికలకు సంబంధించిన పనులు, కార్యకలాపాల్లో చిన్నారులు పాల్గొనకుండా చూడాలని ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఉల్లంఘనలు జరిగితే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను వీడనున్న 15 మంది ఎమ్మెల్యేలు!

షిండే, అజిత్ వర్గాల్లో చేరికకు ఏర్పాట్లు

ముంబై (నమస్తే తెలంగాణ): ఇటీవల మాజీ మంత్రి మిలింద్ దేవ్‌రా కాంగ్రెస్‌ను వీడి శివసేన(షిండే వర్గం)లో చేరారు. అదే బాటలో మహారాష్ట్ర కాంగ్రెస్ కీలక నేతలు త్వరలో పార్టీని వీడనున్నారు. ముంబైలో కీలకమైన మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ, ఆయన కుమారుడు ఎమ్మెల్యే జీషన్ సిద్ధిక్‌లు ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం)లోకి వస్తారనే చర్చ సాగుతున్నది. అయితే వీరే కాకుండా ఇంకా 15 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారని ఆ పార్టీ కీలక నేత ఒకరు వెల్లడించారు. ఓ ఇంగ్లిష్ వెబ్‌సైట్ ప్రచురించిన ఈ వార్త రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతున్నది. అజిత్ పవార్ వర్గంలోకి ముస్లిం ఎమ్మెల్యేలతో సహా ఇతర కాంగ్రెస్ నేతలను చేర్చుకోవడం ద్వారా ముంబైలో మహా కూటమి బలాన్ని పెంచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. బీజేపీ చేర్చుకోవాలనుకొంటున్న వారిలో ఈడీ కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలూ ఉన్నారు. రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర ముంబైకి చేరుకోకముందే వీరంతా పార్టీ ఫిరాయింపులకు పాల్పడేలా బీజేపీ స్కెచ్ వేసిందని కాంగ్రెస్ కీలక నేత తెలిపారు.

బలపరీక్ష నెగ్గిన చంపయీ

- 47-29 ఓట్లతో జేఎంఎం కొత్త సర్కార్ విజయం
- ఓటింగ్‌కు హాజరైన మాజీ సీఎం హేమంత్ సోరేన్
- అవినీతి ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటానని బీజేపీకి సవాల్
- తన అరెస్టులో గవర్నర్ పాత్ర ఉందని ఆరోపణ



రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీలో సోమవారం నిర్వహించిన బలపరీక్షలో సీఎం చంపయీ సొరేన్ నేతృత్వంలోని జేఎంఎం కూటమి ప్రభుత్వం నెగ్గింది. 81 మంది ఎమ్మెల్యేలు ఉండే అసెంబ్లీలో చంపయీ సర్కార్ ప్రవేశపెట్టిన విశ్వాస పరీక్ష తీర్మానానికి అనుకూలంగా 47 మంది శాసనసభ్యులు ఓటు వేయగా.. ప్రతిపక్ష బీజేపీ కూటమికి చెందిన 29 మంది ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. తీర్మానంపై ఓటింగ్‌కు అసెంబ్లీకి మొత్తం 77 మంది ఎమ్మెల్యేలు హాజరు కాగా, స్వతంత్ర ఎమ్మెల్యే సరయు రాజ్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. దీంతో అధికార జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి బలపరీక్ష నెగ్గడంతో కూటమి ఎమ్మెల్యేల ఫిరాయింపు ఊహాగానాలకు తెరపడింది. ఈడీ కస్టడీలో ఉన్న మాజీ సీఎం హేమంత్ సోరేన్ కోర్టు అనుమతితో ఓటింగ్‌లో పాల్గొన్నారు. అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం చంపయీ సొరేన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకొని హేమంత్ సొరేన్‌పై తప్పుడు కేసులు బనాయించిందని విమర్శించారు.

ఆదివాసీలపై బీజేపీ చిన్నచూపు..

తనపై అవినీతి ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటానని మాజీ సీఎం హేమంత్ సోరేన్ బీజేపీకి సవాల్ విసిరారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ తన అరెస్టుపై కేంద్రం పన్నిన కుట్రలో రాజ్‌భవన్ కీలక పాత్ర పోషించిందంటూ సంచలన ఆరోపణలు చేశారు. జనవరి 31 భారత చరిత్రలో ఒక చీకటి అధ్యాయం అని, గవర్నర్ ఆదేశాల మేరకు ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేశారని అన్నారు. రాజ్‌భవన్‌లో ఒక సీఎంను అరెస్టును చేయడం దేశ చరిత్రలోనే ఇదే తొలిసారని పేర్కొన్నారు. తన అరెస్టుకు 2022 నుంచి కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. జార్ఖండ్‌లో ఒక ఆదివాసీ వ్యక్తి సీఎంగా ఐదేండ్ల పదవీకాలాన్ని పూర్తి చేయకూడదని అనుకొంటున్నదని, వారు తమ పాలనలో కూడా దీన్ని అనుమతించరని అన్నారు. ఆదివాసీలను బీజేపీ అంటరానివారిగా చూస్తున్నదని విమర్శించారు.

కెనడాలో విదేశీయులు ఇండ్లు కొనడంపై నిషేధం పొడిగింపు

టొరంటో, జనవరి 5: కెనడాలో విదేశీయులు ఇండ్లు కొనడంపై విధించిన నిషేధాన్ని అక్కడి ప్రభుత్వం పొడిగించింది. కెనడియన్లు సొంత నివాసాలు సమకూర్చుకోవడానికి ఇబ్బందులు తలెత్తున్న క్రమంలో విదేశీ ఉద్యోగులు, విద్యార్థులు ఇండ్లు కొనడంపై నిషేధాన్ని మరో రెండేండ్ల వరకు పొడిగించారు. ప్రస్తుతం 2025 జనవరి 1 వరకు ఉన్న నిషేధాన్ని 2027 జనవరి 1 వరకు పొడిగించారు. ఈ మేరకు కెనడా ఉప ప్రధాని క్రిస్టియా ఫ్రీలాండ్ ఓ ప్రకటన విడుదల చేశారు.

లక్నో జైలులో 63 మంది ఖైదీలకు హెచ్ఐవీ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో జిల్లా జైలులో హెచ్ఐవీ బాధితుల సంఖ్య 63కు పెరిగింది. గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన పరీక్షల్లో 36 మంది ఖైదీలకు ఈ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో వ్యాధి బాధితుల సంఖ్య 63కు పెరిగింది. టెస్టింగ్ కిట్లు అందుబాటులో లేకపోవడం వల్ల పరీక్షలు చేయలేదని జైలు అధికారులు చెప్పారు. హెచ్ఐవీ పాజిటివ్ వచ్చిన వారిలో అత్యధికులు మాదక ద్రవ్యాలకు బానిసగా మారిన వారేనని, జైలు బయట కలుషిత సిరంజిలను ఉపయోగించడం వల్ల వీరికి ఈ వ్యాధి సంక్రమించినట్లు చెప్పారు.

హెచ్-4 వీసాదారులకు 'ఆటోమేటిక్ వర్క్ ఆథరైజేషన్'

త్వరలో కీలక బిల్లును ఆమోదించనున్న బైడెన్ సర్కార్

వాషింగ్టన్: అమెరికాలోని భారతీయులకు శుభవార్త. హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు, 21 ఏండ్లలోపు వయసున్న పిల్లలు అమెరికాలో ఉద్యోగాలు చేసుకునేందుకు వీలు కల్పించే కీలక బిల్లును బైడెన్ సర్కారు త్వరలో ఆమోదించనున్నది. దీంతో దాదాపు లక్ష మంది హెచ్-4 వీసాదారులకు (హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు, పిల్లలకు) ఆటోమేటిక్ వర్క్ ఆథరైజేషన్ లభిస్తుంది. ఇందుకు సంబంధించిన జాతీయ భద్రతా ఒప్పందాన్ని అమెరికా పార్లమెంట్‌లో ఆమోదించాలని అధికార డెమోక్రటిక్, ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీల నాయకులు అంగీకారానికి వచ్చారు. అమెరికా సెనేట్‌లో ఆదివారం ఇరు పక్షాల మధ్య సుదీర్ఘ చర్చల అనంతరం ఈ అంగీకారం కుదిరింది. దీంతో 21 ఏండ్ల కంటే అధిక వయసున్న దాదాపు 2.5 లక్షల మంది హెచ్-1బీ వీసాదారుల పిల్లలకు కూడా పరిష్కారం లభిస్తుంది. అమెరికాలో గ్రీన్‌కార్డుల కోసం చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్న వేల మంది భారత వృత్తి నిపుణులకు ఇది ఎంతో ప్రయోజనకరమైన బిల్లు. ఈ బిల్లు అమలైతే వచ్చే ఐదేండ్లపాటు ఏటా 1,58,000 మందికి గ్రీన్‌కార్డులు మంజూరు చేస్తారు. అలాగే ఏటా దాదాపు 25 వేల మంది కే-1, కే-2, కే-3 వలసేతర వీసాదారుల (అమెరికా పౌరుల కాబోయే జీవిత భాగస్వాములు లేదా జీవిత భాగస్వాములు, పిల్లల)తోపాటు లక్ష మంది హెచ్-4 వీసాదారులకు వారి జీవిత భాగస్వాములు పనిచేసే ప్రాంతాల్లోనే ఉద్యోగాలు చేసుకునే అవకాశం లభిస్తుందని యూఎస్ అధ్యక్ష భవనం 'వైట్ హౌస్' వెల్లడించింది.

తొలి భారత సంతతి ఆస్ట్రేలియా సెనేటర్‌గా వరుణ్



సిడ్నీ, ఫిబ్రవరి 5: ఆస్ట్రేలియా సెనేట్‌కు ఎన్నికైన తొలి భారత సంతతి వ్యక్తిగా వరుణ్ ఘోష్ రికార్డు సృష్టించారు. 1980లో తల్లిదండ్రులతో కలిసి ఆస్ట్రేలియా వెళ్లిన వరుణ్ 17 ఏండ్ల వయసున్నప్పుడే లేబర్ పార్టీలో చేరారు. న్యాయవాది అయిన ఆయన పశ్చిమ ఆస్ట్రేలియా తోపాటు ప్రపంచబ్యాంకుకు సేవలు అందించారు. ఇదే సమయంలో పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించేవారు. సెనేటర్‌గా ఎన్నికైన అనంతరం వరుణ్ మాట్లాడుతూ అందరికీ నాణ్యమైన విద్య, శిక్షణ అందేలా చూస్తానని తెలిపారు.

మే నాటికి భారత బలగాలు వెనక్కి!

మాల్దీవులు అధ్యక్షుడు ముయిజ్జు

మాలే: ఈ ఏడాది మే 10 నాటికి తమ దేశంలోని భారత బలగాలను వెనక్కు పంపిస్తామని మాల్దీవులు అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మార్చి 10 కంటే ముందు మొదటి గ్రూపు ఉపసంహరణ జరుగుతుందని, మే 10వ తేదీలోగా మిగతా రెండు వైమానిక స్థావరాల్లోని రెండు గ్రూపుల బలగాలు వెనక్కు వెళ్తాయని, ఈ మేరకు రెండు దేశాల మధ్య జరిగిన తాజా దౌత్య చర్చల్లో ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. ఆ దేశ పార్లమెంట్‌లో సోమవారం ఆయన మొదటిసారిగా ప్రసంగించారు. అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తమ దేశంలోని 88 మంది సైనికులను భారత్ ఉపసంహరించుకోవాలని కోరారు.

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు సమీపంలోని టోంగి రైల్వే స్టేషన్‌లో ఆదివారం కనిపించిన దృశ్యమిది. ఏటా నిర్వహించే అఖేరి మునాజత్ ప్రార్థనల్లో పాల్గొని, స్వస్థలాలకు తిరిగి వెళ్లేందుకు రైలుపై ముస్లిం భక్తుల ఫీట్లు

టైఫాయిడ